క్లుప్తంగా

వైభవంగా ఎండు మిరపకాయల మహాయజ్ఞం

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని పెద్దనపాడు గ్రామంలో వెలసిన మదనగోపాలస్వామి దేవాలయంలో నారాయణీ ప్రత్యంగిరా మహాదేవి దివ్య విశ్వశాంతి ఆశీస్సులతో ఎండు మిరపకాయల మహాయజ్ఞం ఆదివారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి యర్రగుంట్ల మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి హాజరయ్యారు. 108 కలశాలతో హోమ ప్రవేశం చేశారు. ఈ మహాయజ్ఞం వలన సకల సంపదలు కలుగుతాయని వారు తెలిపారు.

సాంస్కృతిక నిలయం శిల్పారామం



నృత్య ప్రదర్శనలో చిన్నారులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని శిల్పారామం సాంస్కృతిక నిలయంగా మారింది. సందర్శకులకు ఆహ్లాదాన్ని, ఆనందాన్ని పంచిపెట్టేందుకు ఎన్నో సాంస్కృక ప్రదర్శనలతో ఆకట్టుకుంటున్నారు. ఆదివారం శిల్పారామం పరిపాలనాధికారి సుధాకర్ ఆధ్వర్యంలో డాక్టర్ జీ.రవీంద్రారెడ్డి సౌజన్యంతో కడప ఎస్ఎస్ఎల్ డ్యాన్స్ స్టూడియోస్ మాస్టర్ సింహా తమ చిన్నారులు జానపదం, వెస్ట్రన్, శాస్త్రీయ నృత్యాలతో అలరించారు.

ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు



ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలుపుతున్న ఆర్టీపీపీ ఉద్యోగులు

ఎర్రగుంట్ల : విద్యుత్ ఉద్యోగుల సంఘాల నాయకులు ఆదివారం నిడుజివ్వి గ్రామంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డిని కలసి ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులో పనిచేస్తున్న విద్యుత్ ఉద్యోగుల సమస్యలను ఉక్కు పరిశ్రమ భూమిపూజకు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఎమ్మెల్యే చర్చించి వారి సమస్యలను పరిష్కరించడంతో వారు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే ఎర్రగుంట్ల పట్టణంకు చెందిన మిట్టమానుపల్లె అబ్దుల్ అనారోగ్యంతో ఉండటంతో ఎమ్మెల్యే ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు.

అల్లాడుపల్లెలో బండలాగుడు పోటీలు

– ప్రథమ బహుమతి సాధించిన ప్రొద్దుటూరు ఎద్దులు

చాపాడు : అల్లాడుపల్లె శ్రీవీరభద్రస్వామి సన్నిధిలో మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని ఆదివారం మధ్యాహ్నం రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రొద్దుటూరు మండలం చౌటపల్లెకు చెందిన మార్తల చంద్ర ఓబుళరెడ్డి ఎద్దులు 1808.01 అడుగులు బండను లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. నంద్యాల జిల్లా పీఆర్ పల్లెకు చెందిన నాగయ్య ఎద్దులు 1680 అడుగులు లాగి ద్వితీయ స్థానం, నందలూరుకు చెందిన హబీబుల్లా ఎద్దులు 1465.08 అడుగులు లాగి తృతీయ స్థానం, వీరపునాయునిపల్లె మండలం కీర్తిపల్లెకు చెందిన చిట్టిబోయిన భరత్ కుమార్ ఎద్దులు నాలుగో స్థానం, సింహాద్రిపురం మండలం చెర్లోపల్లెకు చెందిన నంద్యాల శివరామిరెడ్డి ఎద్దులు ఐదోస్థానం, ప్రొద్దుటూరు మండలం ఖాదర్‌బాద్ సిద్దారెడ్డి నాగసుబ్బారెడ్డి ఎద్దులు ఆరో స్థానం, దొరసానిపల్లెకు ఎద్దులు ఏడో స్థానాలల్లో నిలిచాయి. గెలుపొందిన ఎద్దుల యజమానులకు పలువురు ప్రోత్సాహికులు విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ వెంకటసుబ్బారెడ్డి, ఈఓ శ్రీనివాసులు, మాజీ సింగిల్ విండో చైర్మన్ వేమారెడ్డి, గ్రామ సర్పంచ్ కిశోర్‌కుమార్‌రెడ్డి, ఓబుళరెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులకు కరువు భత్యం ప్రకటించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం కరువు భత్యం ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల కోరారు. ఆదివారం శ్రీవెంకటేశ్వర డిగ్రీ కాలేజిలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కేంద్ర ఉద్యోగులకు మూడు డీఏలు ప్రకటించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక్క డీఏ కూడా ప్రకటించలేదని తెలిపారు. 2018 నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు రావాల్సిన డీఏలను ఇంత వరకు చెల్లించలేదని తెలిపారు. పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఒంటేరు శ్రీనివాసులరెడ్డికి విజయానికి ఏపీటీఎఫ్ సభ్యులు కృషి చేయాలని కోరారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాం సుందర్‌రెడ్డి, ఏపీటీఎఫ్ జిల్లా భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నాగరాజు, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు కృష్ణారెడ్డి, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు రామదస్తగిరిరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్లు గోపినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆ దిగుడు బావి.. దిగ్గజ బావి



గురిజాల గ్రామంలో కంభాల కట్ట బావి



కంభాల కట్ట బావిలో దిగుడు తాపలు

సింహాద్రిపురం : నేటి తరానికి తాగునీరు ఇంటి ముంగిటకే చేరుతోంది. ఒకనాడు తాగునీటి కోసం జనం భగీరథ ప్రయత్నాలే చేసేవారు. కొంతకాలం వెనక్కి వెళితే ఏర్లు, గిలక బావులు, దిగుడు బావులు ఆధారంగా తాగునీరు తెచ్చుకునేవారు. ఇప్పుడవి కనుమరుగయ్యాయి. వాటి స్థానంలో శుద్ధి జలాలు రాజ్యమేలుతున్నాయి. గిలకబావులు, దిగుడు బావులు మచ్చుకు కూడా కనిపించని పరిస్థితి. ఈ కోవలోనే సింహాద్రిపురం మండలం గురిజాల గ్రామంలోని దిగుడు బావి ఒకటి. పాత తరానికి సాక్ష్యంగా నిలుస్తోంది. సుమారు 150 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ దిగుడు బావి గ్రామం నడిబొడ్డున ఉంది. ఈ బావి నిర్మాణమే ఒక షెట్టింగ్‌లా ఉంటుంది. భూఉపరితలానికి వివిధ స్థాయిల్లో 60 అడుగుల నుంచి 100 డుగుల లోతులో రాతి కట్టడం ఈ బావి యొక్క ప్రత్యేకత. పది అడుగుల వెడల్పుతో సుమారు వంద మెటికల నిర్మాణం కలిగి ఉంటుంది. మధ్యలో ఒక గదిని కూడా నిర్మించారు. ఈ బావి సమీపలలోనే రాతి స్తంభాలతో ఒక ఎత్తైన నిర్మాణం ఉంది. దీన్ని



గురిజాల గ్రామంలో కంభాల కట్ట

కంభాల కట్ట అంటారు. కంభాల కట్టకు దగ్గరగా ఉండటంవల్ల ఈ బావిని ×కంభాల కట్ట బావి×గా పిలుస్తారు. ఈ బావిని గ్రామంలోని చెన్నమరెడ్డి వంశస్తులు నిర్మించారని ప్రతీతి. ఆ వంశానికి చెందిన కుటుంబీకులు గ్రామంలో పది కుటుంబాలకుపైగా ఉన్నాయి. సుమారు వంద మెటికలు దిగిన తర్వాత అక్కడ ఉన్న దిగుడు బావిలో ఒంగి నీటిని చేది కడవలు, బిందెలను మోసుకుని మళీ వంద మెటికలు ఎక్కాల్సిందే. బావిలోకి దిగడం, చేదడం, నిండు బిందెతో పైకి ఎక్కడం.. ఇప్పటి యువతానికి అది సాధ్యమయ్యే పనే కాదు.. ఎందుకంటే నీరసం, కాళ్ల లాగడం మన వెంటే వస్తాయి. మరీ 40 ఏళ్ల ముందు గ్రామంలోని సగం కుటుంబాలు ఈ బావి నుండే నీరు తెచ్చుకునేవారంటే ఎన్ని ప్రయాసాలు పడ్డారో తెలుస్తుంది. పైగా సమీపంలోని కంభాల కట్టకు ఒక ప్రత్యేకత ఉంది. పాము కరిచిన వ్యక్తి ఈ కట్టపై మూడు రోజులు ఉండి పక్కనే ఉన్న కంభాల కట్ట బావిలోని నీరు తాగితే విషం తగ్గి కోలుకునేవారని గ్రామస్తులు చెబుతారు. 20 ఏళ్లకు ముందు వరకు ఇలా ఎక్కువగా వస్తుండేవారని.. ఇప్పుడు రావడం తగ్గిపోయారని వారు తెలిపారు.

ఏదీ ఏమైనా గురిజాల గ్రామంలోని ఈ కంభాల కట్ట బావి ఒకనాడు వైభవంగా వెలిగింది. గ్రామస్తులకు మంచినీటిని అందించడమే కాకుండా, పాము కాటు బాధితులకు ఉపశమనం కలిగిస్తుండేది. నేడది గత వైభవానికి చిహ్నంగా మిగిలిపోయింది.

హోటళ్లు, మాంసం దుకాణాల ఆకస్మిక తనిఖీ



హోటళ్లలను తనిఖీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి తదితరులు

పులివెందుల టౌన్ : పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని హోటళ్లు, మాంసం దుకాణాలపై ఆదివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి ప్లాస్టిక్ వాడుతున్న వారికి భారీగా జరిమానా విధించారు. ఫ్యామిలీ రెస్టారెంట్ అని చెప్పుకుంటున్న హోటల్లో ఇడ్లీ ఉడికించేందుకు ప్లాస్టిక్ కవర్లు వాడుతుండటంతో వారికి జరిమానా విధించారు. ఇడ్లీని ఉడికించేందుకు గుడ్డలు మాత్రమే వాడాలని..ప్లాస్టిక్ వాడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడేవారు ఎంతటివారైనా ఉపేక్షించేదిలేదన్నారు. ప్లాస్టిక్ కవర్లు, బ్యాగులు ఎవరు అమ్మినా, వినియోగించినా చర్యలు తప్పవన్నారు. మాంసం దుకాణాలను పరిశీలించి నాణ్యమైన మాంసం మాత్రమే విక్రయించాలన్నారు. మాంసం ధరలు కూడా అదుపులో ఉండాలన్నారు. పశు వైద్యాధికారులు పరీక్షించి ధృవీకరించిన వాటిని మాత్రమే క్రయ విక్రయాలు జరపాలన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ సెక్రటరీలు కృష్ణార్జునరెడ్డి, సతీష్‌రెడ్డి, నటరాజ్, సీసీ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులకు గురైన రైల్వే గేటు



రైల్వేగేటు వద్ద ఆగిపోయిన వాహనాలు

కమలాపురం : పట్టణంలోని ప్రధాన రహదారిపై ఉన్న రైల్వే గేటు ఆదివారం మరమ్మతులకు గురి కావడంతో నాగులు గంటల పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆదివారం 10 గంటల సమయంలో రైల్వే గేటు మరమ్మతులకు గురైంది. పట్టణం నుంచి క్రాస్ రోడ్డు వైపు వెళ్లే వాహనాలు బారులు తీరాయి. అల్లాడుపల్లె తదితర శైవ క్షేత్రాలకు వెళ్లి తిరుగు ముఖం పట్టిన ప్రయాణీకులు నాలుగు గంటల పాటు నిరీక్షించాల్సి వచ్చింది. క్రాస్ రోడ్డు వైపు నుంచి ఖాజీపేట, మైదుకూరు తదితర ప్రాంతాలకు వెళ్లే లారీలు, బస్సులు, ఇతర వాహనాలు తిరిగి క్రాస్ రోడ్డుకు వెళ్లి అక్కడి నుంచి వారి గమ్య స్థానాలకు చేరుకున్నారు. కానీ పట్టణం లోపలి వైపు ఉండే వాహనాలు తిరిగి వెళ్లాలంటే ఖాజీపేటకు వెనక్కి వెళ్లాల్సి రావడంతో ఆ వాహనాలు అక్కడే ఆగిపోయాయి. మధ్యాహ్నం రైల్వే గేటు మరమ్మతులు పూర్తి కావడంతో వాహనదారులు వెళ్లిపోయారు.

రవీంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించండి



పట్టభద్రులను అభ్యర్థిస్తున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధర్‌రెడ్డిలు కోరారు. ఆదివారం ఉదయం ఎమ్మెల్సీ అభ్యర్థితో కలసి వారు 21వ వార్డులో ప్రచారం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా రవీంద్రారెడ్డి పనిచేస్తారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజుల్లా, కౌన్సిలర్లు కొండ్రావ్, కోడిరమణ, పార్నపల్లె కిషోర్, డేనియల్‌బాబు, లక్ష్మీభార్గవి, లక్ష్మీప్రసన్న, కాంతమ్మ, గుల్జార్, కోఆప్షన్ సభ్యులు చంద్రమౌళి, హౌసింగ్ డైరెక్టర్ శైలజ, రంగనాథస్వామి ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు యార్వ వెంకటసుబ్బయ్య, రసూల్, సోపాల వీరా, చంద్రమౌళి, కొంగనపల్లె మురళీ తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రిపురం : పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని వైఎస్సార్ సీపీ నాయకులు కోరారు. ఆదివారం మండలంలోని బి.చెర్లోపల్లె, బిదినంచర్ల, గురిజాల, హిమకుంట్ల గ్రామంలో అభ్యర్థి రవీంద్రారెడ్డితో కలసి వారు ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, బ్రహ్మనందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గండిలో జనసంద్రం



చక్రాయపేట : మహాశివరాత్రి సందర్భంగా పాలతల జాతరకు వెళ్లిన భక్తులతో ఆదివారం గండి పుణ్యక్షేత్రం జనసంద్రంగా మారింది. అన్నమయ్య, సత్యసాయి, అనంతపురం, చిత్తూరు జిల్లాలతో పాటు కర్నాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి పాలతలకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. వీరంతా తిరుగు ప్రయాణంలో గండికి చేరుకుని అంజన్నను దర్శించుకుంటారని వీరికి ఆలయ అధికారి ముకుందరెడ్డి, చైర్మన్ రాఘవేంద్ర ప్రసాద్‌లు తగిన ఏర్పాట్లు చేయించారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఘనంగా గంగమ్మ తిరునాల



పులివెందుల: ప్రత్యేక అలంకరణలో గంగమ్మ చింతల అమ్మవారు



ముద్దనూరు : తిరునాలలో భక్తులు

పులివెందుల రూరల్ : మండలంలోని తుమ్మలపల్లె సమీపంలో వెలసిన గంగమ్మ చింతలలో అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని మరుసటి రోజు గంగమ్మ చింతలలో సిరిబండికి భాను గొర్రెను కట్టి తుమ్మలపల్లె నుంచి ఊరేగింపుగా గంగమ్మ చింతలకు చేరుకుని అక్కడ అమ్మవారికి జంతుబలులు సమర్పించారు. గంగమ్మ చింతలకు పులివెందుల, తొండూరు మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అలాగే పట్టణంలోని కదిరి రోడ్డులో ఉన్న దిన్నెపాటి గంగమ్మతల్లి తిరుణాల సందర్భంగా మంగళవారం బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు సుంకర వెంకటనారాయణ తెలిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. ఒంగోలు గిత్తల చే బండ లాగుడు పోటిలు ఉంటాయన్నారు. మొదటి బహుతిరూ.80 వేలు, రెండవ బహుమతి రూ.60 వేలు, మూడవ బహుమతి రూ.40 వేలు, 4వ బహుమతి రూ.20 వేలు, 5వ బహుమతి రూ.10 వేలు ఉంటుందన్నారు. రాత్రి సమయంలో జ్యోతుల కార్యక్రమం ఉంటుందన్నారు.

చింతకొమ్మదిన్నె : కొత్తపేట–బుగ్గలేటిపల్లి సరిహద్దుల్లోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పట్టు వస్త్రాలతో అమ్మవారిని అలంకరించారు. కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ముద్దలను ఏర్పాటు చేసి ఆభరణాలను, పట్టు వస్త్రాలను కానుకలుగా సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ పార్వతమ్మగారి విశ్వనాథ్‌రెడ్డి, ఆలయ కార్య నిర్వహణ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు. ఆలయ సమీపంలోని ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ముద్దనూరు : మహాశివరాత్రి పర్వదినం మరుసటి రోజున ప్రతి ఏడాది నిర్వహించే గంగమ్మ తిరునాల ఆదివారం సాయంత్రం ఘనంగా జరిగింది. మండలంలోని బొందలకుంట గ్రామంలో వెలసిన శ్రీగంగమ్మ–పాలేటమ్మ ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన తిరునాలకు అధిక సంఖ్యలో భభక్తులు హాజరయ్యారు. ఆలయంలోని గంగమ్మ, పాలేటమ్మ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

కడపరాయుని కల్యాణ వైభోగం



కల్యాణోత్సవాన్ని హాజరైన భక్తులు



కల్యాణమూర్తులుగా స్వామి, అమ్మవార్లు

కడప కల్చరల్ : దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం శ్రవణానక్షత్రం సందర్భంగా స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు మచ్చా శేషాచార్యులు, కృష్ణమోహన్, త్రివిక్రమ్ బృందం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉభయదేవేరులతో సహా స్వామి ఉత్సవ మూర్తులను వధూవరులుగా అలంకరించి కల్యాణ పీఠంపై కొలువుదీర్చారు. కల్యాణ క్రతువును క్రమంగా నిర్వహించారు. అనంతరం స్వామి పక్షాన అమ్మవార్ల గళసీమల్లో అలంకరించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు కల్యాణ హారతులు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం వధూవరులను పల్లకీపై కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం

గోపవరం : మండలంలోని మల్లెంకొండేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం అర్ధరాత్రి బద్వేలు మున్సిపల్ చైర్మన్ ఆర్.వి.సాయికృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన శివపార్వతుల కల్యాణం అనంతరం స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



కల్యాణ క్రతువును నిర్వహిస్తున్న ఉభయదారులు



కల్యాణ మహోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

వీరపునాయునిపల్లె : పాపాఘ్ని నది ఒడ్డున వెలసిన సంగమేశ్వరాలయంలో ఆదివారం ఉదయం 3 గంటలకు ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రమణ్యశర్మ స్వామి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఉత్సవ మూర్తులను తేరుపై ఉంచి ఊరేగింపు నిర్వహించారు. చిన్నారులచే ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకొంది. సంగమేశ్వరాలయంలో రెండు రోజుల పాటు జరిగిన మహాశివరాత్రి ఉత్సవాలు ముగిశాయి. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. కార్యక్రమాల్లో ప్రముఖ చిన్నపిల్లల వైద్యులు కరుణాకర్‌రెడ్డి దంపతులు, సంగమ్మ దంపతులు, రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ రోజారమణి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, ప్రముఖ కాంట్రాక్టర్ బ్రహ్మానందరెడ్డి, షిర్డిసాయి ఎలక్ట్రికల్స్ ఎండీ విశ్వేశ్వర్‌రెడ్డి, రెడ్డిరాధ, ఉమ, వినయ్‌కుమార్‌రెడ్డి, ఆలయ చైర్మన్ ఎస్‌పీ శివాంజనేయరెడ్డి, ఈఓ జగన్‌మోహన్‌రెడ్డి, సీఐ సత్యబాబు, ఎస్ఐ రాజారమేష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఒలంపిక్ సంఘం నూతన కమిటీ ఏర్పాటు



ఏకగ్రీవంగా ఎన్నికైన జిల్లా ఒలంపిక్ సంఘం నూతన కమిటీ

కడప స్పోర్ట్స్: వైఎస్ఆర్ కడప జిల్లా ఒలంపిక్ సంఘం నూతన కమిటీ ఏర్పాటైంది. కడప నగరంలోని వైఎస్ఆర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన జిల్లా ఒలంపిక్ సంఘం సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా, ఏపీ ఒలంపిక్ సంఘం పరిశీలకులుగా విచ్చేసిన శ్రీధర్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకుడు ఎస్.వి.పి. అమృత్‌రా ఎన్నికల నిర్వహణ తీరును పరిశీలించారు. న్యాయ పరిశీలకులుగా ఎస్. షామ్స్ తబ్రేజ్ వ్యవహరించారు. అనంతరం వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు ఒలంపిక్ సంఘం నూతన కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జిల్లా అధ్యక్షుడిగా సమరనాథరెడ్డి

జిల్లా ఒలంపిక్ సంఘం జిల్లా అధ్యక్షుడుగా కె.ఎస్. సమరనాథరెడ్డి(స్క్వాష్) ప్రధాన కార్యదర్శిగా సునీల్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు చైర్మన్‌గా టి. సుధీర్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా సుధాకర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా నాయబ్ రసూల్, టి. జనార్థన్, కోశాధికారిగాసాయికిశోర్, ఈసీ మెంబర్లుగా ప్రిన్స్ ఐజాక్, అశ్వర్థలను ఎన్నుకున్నారు.

26న జిల్లాస్థాయి హిందీ ప్రతిభ పరీక్ష

రాజంపేట టౌన్: పట్టణంలోని మన్నూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 26వ తేదీ ఉదయం 10 గంటల నుంచి టెన్త్ విద్యార్థులకు హిందీ ప్రతిభ పరీక్షను నిర్వహించనున్నట్లు ప్రేమ్‌చంద్ హిందీ భవన్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.సర్తాజ్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లా స్థాయిలో ప్రేమ్‌చంద్ హిందీభవన్ సొసైటీ ఆధ్వర్యంలో పరీక్షను నిర్వహించనున్నామని వివరించారు. మరిన్ని వివరాలకు 6303701314 నెంబర్‌లో సంప్రదించవ్చని తెలిపారు

ఈఈఎంటీ ప్రతిభా పరీక్షలో స్టేట్ ఫస్ట్ ర్యాంకు

మైదుకూరు : ఉపకార వేతనాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ఈఈఎంటీ (ఎడ్యుకేషన్ ఎపిఫని మెరిట్ టెస్ట్) ప్రతిభా పరీక్షలో మైదుకూరు మున్సిపాలిటీలోని కేశలింగాయపల్లెకు చెందిన విద్యార్థిని పసల వీర ఉదయశ్రీ రాష్ట్రంలో మొదటి ర్యాంకు సాధించింది. ప్రభుత్వ పాఠశాలల్లో 7, 10 తరగతులు చదివే విద్యార్థుల కోసం ప్రభుత్వం ఈ పరీక్ష నిర్వహిస్తుంది. ఏడవ తరగతి చదివే వారు ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే 10వ తరగతి వరకు ఏడాదికి రూ.20వేలు ఉపకార వేతనం పొందుతారు. తమ పాఠశాలకు చెందిన విద్యార్థిని ఈఈఎంటీ పరీక్షలో ప్రతిభ చాటి రాష్ట్రంలో మొదటి ర్యాంకు సాధించడం పట్ల పాఠశాల హెడ్‌మాస్టర్ సత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు



పులివెందుల : బైక్‌ర్యాలీలో పాల్గొన్న హిందూ యువత



జమ్మలమడుగులో ర్యాలీ నిర్వహిస్తున్న పట్టణవాసులు



ఎర్రగుంట్లలో ర్యాలీ చేస్తున్న హిందువులు

పులివెందుల టౌన్ : హిందువుల సామ్రాట్ చత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురష్కరించుకుని హిందూ ఐక్యవేధిక ఆధ్వర్యంలో పులివెందులలో ఆదివారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ముందుగా చత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని ముద్దనూరు రోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద నుంచిభె బైక్‌ర్యాలీ ప్రారంభించారు. కాషాయం జెండాలను పట్టుకుని యువకులు పెద్ద ఎత్తున నినాదాలతో హోరెత్తించారు. ర్యాలీ మెయిన్ బజార్, పూలంగళ్ల సర్కిల్, వైఎస్సార్ సర్కిల్ మీదుగా సాగింది. కార్యక్రమంలో హిందు ఐక్యవేదిక సభ్యులు, హిందువులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ఎర్రగుంట్ల : పట్టణ పరిధిలో విశ్వహిందూ పరిషత్ హిందువుల ఆధ్వర్యంలో చత్రపతి శివాజీ జయంతి సందర్భంగా అదివారం ర్యాలీ నిర్వహించారు. నడివూరు రామాలయం వద్ద నుంచి ప్రొద్దుటూరు, వేంపల్లి రోడ్డు, కడప రోడ్డుల మీదుగా ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ సభ్యులు మాట్లాడుతూ యువకులందరూ ఆయన అడుగుజాడలలో నడవాలని కొరారు. కార్యక్రమంలో హిందూవులు, విశ్వ హిందుపరిషత్ నాయకులు, ఎర్రగుంట్ల అయ్యప్పస్వామి సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.